సభలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి, చిత్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



కందుకూరులో జరిగిన రైతు ధర్నాలో పెద్దసంఖ్యలో పాల్గొన్న రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు

దద్దరిల్లిన రైతుధర్నా

- భారీగా తరలివచ్చిన రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు
- శ్రీశైలం, హైదరాబాద్ రహదారిపై ర్యాలీ
- పాత జ్ఞాపకాన్ని గుర్తు చేసుకున్న కేటీఆర్

బడంగ్‌పేట/కందుకూరు/ఎల్బీనగర్, అక్టోబర్ 5: ఏకాలంలో రైతులకు రణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ కందుకూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు ధర్నా విజయవంతం అయింది. అనుకున్న దాని కంటే రెట్టింపు స్థాయిలో రైతులు వచ్చారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి రాకకోసం ఎదురు చూసిన రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు.. వారు రాగానే భారీ ఎత్తున స్వాగతం పలికారు. హైదరాబాద్-శైశ్రీలం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఎక్కడ చూసిన గులాబీ పార్టీ నాయకులు కనిపించారు. సమావేశానికి వచ్చిన నాయకులు, కార్యకర్తలు రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు పోరాడాలని అప్పటి వరకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ధర్నా విజయవంతం కావడంతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు

భారీగా తరలివెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు

కందుకూరులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రైతు మహాధర్నాకు భారీ స్పందన వచ్చింది. రైతులకు మద్దతుగా అన్ని వర్గాల ప్రజలు ధర్నాలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ధర్నాకు తలివచ్చారు. అందరి మద్దతుతో ధర్నా సక్సెస్ అయింది. మీర్‌పేట, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ల నుంచి, తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీల నుంచి, సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్ల నుంచి రైతు ధర్నాకు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మహేశ్వరం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆంబోతు రాజు నాయక్, తుక్కుగూడ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మయ్య, శ్రీనివాస్ రాజ్, పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, సిద్దాల లావణ్య బీరప్ప, జలాల్పూర్ సునీత బాల్‌రాజ్, లలితాజగన్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టులు

కందుకూరు చౌరస్తాలో శనివారం నిర్వహించిన రైతు భరోసా ధర్నాలో పాల్గొనేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ చైతన్యపురి డివిజన్ అధ్యక్షుడు తోట మహేశ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, సీనియర్ నాయకులు సొంటి చంద్రశేఖర్‌రెడ్డి, త్రివేది, వీరన్న యాదవ్, ప్రవీణ్ చారి, సాయి తదితరులను చైతన్యపురి పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పోలీసుల అదుపులో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు

మూసీ పరీవాహక ప్రాంతంలో నిర్వాసితుల ఇండ్లను కూల్చివేస్తూ మూసీ సుందరీకరణ చేయడాన్ని నిరసిస్తున్న బీజేపీ కార్పొరేటర్ పవన్‌కుమార్‌ను చైతన్యపురి పోలీసులు శనివారం బీజేపీ పార్టీ కార్యాలయంలో అరెస్టు చేశారు. నాగోల్ శుభం కన్వెన్షన్‌లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులతో మూసీ సుందరీకరణపై అనుకూలంగా చేపడుతున్న సమావేశాన్ని అడ్డుకుంటారన్న నెపంతో పోలీసులు కార్పొరేటర్ పవన్‌తో పాటు వారి అనుచరులను, బీఆర్ఎస్ నాయకులను కూడా అదుపులోకి తీసుకున్నారు.



ర్యాలీగా వస్తున్న మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు కేటీఆర్. సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి

గతాన్ని యాది చేసుకున్న కేటీఆర్

కందుకూరు మండలం పట్ల తనకు ఎంతో సంబంధం ఉందని మంత్రి కేటీఆర్ చెప్పారు. తమకు మండల పరిధిలోని దాసర్లపల్లి గ్రామంలో వ్యవసాయం పొలం ఉండేదని ఆ పొలంలో కేసీఆర్ అక్కడే ఉంటు పొలంలో బొప్పాయి. పుచ్చపండ్లు పండించే వారని చెప్పారు. తాను వ్యవసాయ పొలానికి వారానికి రెండు సార్లు వస్తుండేవాడినని, చిన్న రోడ్డు ఉండేదని, గ్రామంలో గణేశ్‌రెడ్డిలాంటి ఎంత మందితో అనుబంధం ఉండేదని వివరించారు. తన గత చరిత్ర మండలం పట్ల ఉన్న సంబంధం వివరించడంతో సభకు వచ్చిన రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందపడ్డారు. అదే విధంగా సబితా ఇంద్రారెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డి ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. కార్యక్రమంలో పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మండల పార్టీ అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, పీఏసీస్ చైర్మన్ చంద్రశేఖర్, పాండు, డైరెక్టర్లు ఆనంద్, శేఖర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, కాకి దశరథ ముదిరాజ్, బేతు ప్రవీణ్‌రెడ్డి, ఇందిరమ్మ దేవేందర్, సురుసాని రాజశేఖర్‌రెడ్డి, దామోదర్‌గౌడ్, మేఘనాథ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, గోవర్ధన్, పరంజోతి, బాలమణి అశోక్, తాళ్ల కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, ప్రశాంత్‌చారి, రాంరెడ్డి, రాజు నాయక్, చంద్రయ్య ముదిరాజ్, తీగల విక్రంరెడ్డి, నియోజకవర్గం నాయకులు కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద కిడ్నాప్ కలకలం

వెల్దండ మండలంలో వదలివెళ్లిన దుండగులు
కిడ్నాపర్లు నయీం అనుచరులై ఉంటారంటున్న స్థానికులు

కతల్ (ఫైల్)

కడ్తాల్, అక్టోబర్ 5: మండల కేంద్రం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద ఓ వ్యక్తి కిడ్నాప్ ఘటన కలకలం రేపింది. కడ్తాల్ సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్ కొండాపూర్‌కి చెందిన పిట్ల కతల్ శనివారం తన కుమారుడు శ్యామ్‌కుమార్, బాబు, డ్రైవర్ విజయ్‌తో కలిసి కారులో, నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కి ఒక పనినిమిత్తం వెళ్లారు. పోలీస్‌స్టేషన్‌లో పని ముగించుకొని తిరుగు ప్రయాణం అవ్వగా మార్గమధ్యలోని కడ్తాల్ టోల్‌ప్లాజా వద్ద, కతల్ ప్రయాణిస్తున్న కారుని నలుగురు వ్యక్తులు ఆపి రాళ్లతో దాడి చేశారు. కారు అద్దాలు పగులగొట్టి ముందు సీటులో కూర్చున్న కతల్‌పై కట్టెలతో విచక్షణారహితంగా దాడి చేసి, ముందే సిద్ధంగా ఉంచుకున్న కారులో బలవంతంగా ఎక్కించుకొని ఆమనగల్లు వైపు వేగంగా వెళ్లారు. కిడ్నాప్ చేసిన వారిలో బద్రియాదవ్, నిజాంతోపాటు మరో ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కతల్ కుమారుడు శ్యామ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, కిడ్నాపర్లు కతల్‌ని వెల్దండ మండలంలోని యెన్నం దవాఖాన సమీపంలో వదిలి పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. కిడ్నాప్ చేసింది నయీం అనుచరులై ఉంటారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

జీహెచ్ఎంసీకి కొత్తగా 125 మంది ఏఈఈలు

GHMC

సిటీబ్యూరో, అక్టోబర్ 5 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో ఇంజినీరింగ్ విభాగంలో మరింత బలోపేతం కానున్నది. రాష్ట్ర వ్యాప్తంగా పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు 146 మంది ఏఈఈలు కొత్తగా నియమాకం కాగా.. ఇందులో జీహెచ్ఎంసీకి 125 మంది ఏఈఈలు రిపోర్టు చేశారు. ఈ మేరకు వీరంతా సోమవారం జీహెచ్ఎంసీలో జాయిన్ రిపోర్టు ఇచ్చి ఆయా పదవిలో బాధ్యతలు చేపట్టనున్నారు.

అభివృద్ధి పనులను త్వరగా చేపట్టాలి

- సీఎం సెక్రెటరీ మణిక్‌రాజ్ కన్నన్
- వికారాబాద్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష

కొడంగల్, అక్టోబర్ 5 : కొడంగల్ నియోజకవర్గంలో మంజూరైన అభివృద్ధి పనుల పురోగతిపై సీఎం సెక్రెటరీ మణిక్‌రాజ్ కన్నన్ జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. శనివారం స్థానిక కడా కార్యాలయంలో వికారాబాద్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు ప్రతీక్ జైన్, సిక్తాపట్నాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిలతో సమావేశమయ్యారు. మంజూరైన అభివృద్ధి పనులు, వాటి పురోగతి, తీసుకొంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా చేపట్టాలని సూచించారు. అనంతరం మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలో నిర్మించనున్న మెడికల్, వెటర్నరీ కళాశాలల స్థలాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అప్పాయిపల్లి గ్రామంలో ఏర్పాటు చేయనున్న మెడికల్, వెటర్నరీ కళాశాలలకు అవసరమైన స్థలాన్ని పరిశీలిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వెంకటస్వామిని ఆదర్శంగా తీసుకోవాలి

వికారాబాద్ : పేద, బడుగు, బలహీన వర్గాలకు సేవలందించిన గడ్డం వెంకటస్వామిని ఆదర్శంగా తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శనివారం గడ్డం వెంకటస్వామి జయంతిని కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యానా యక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి తదితరులు వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు మల్లేశం, బాబూమోజేస్, పర్వీన్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉద్యోగమేళా

రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ అధికారిణి జయశ్రీ

షాబాద్, అక్టోబర్ 5 : టెన్త్, ఇంటర్, డిప్లొమా, పాలిటెక్నిక్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీయువకుల కోసం ఈ నెల ఏడోతేదీన ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ అధికారిణి జయశ్రీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేళాలో ఎంపికైన వారికి ఎల్‌అండ్‌టీ కంపెనీ వారు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ, వసతి, భోజనం కల్పించి ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు.

సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు జిల్లా ఉపాధి కార్యాలయం, శాంతినగర్ ఐటీఐ క్యాంపస్, మల్లేపల్లిలో ఉద్యోగ మేళా ఉంటుందని, మరిన్ని వివరాలకు 98854 77482/89771 75394 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఫార్మా బాధిత రైతులకు అండగా ఉంటాం

మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

రైతుల దీక్షకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

బొంరాస్‌పేట, అక్టోబర్ 5 : దుద్యాల మండలంలోని ఫార్మా బాధిత రైతు కుటుంబాలకు బీజేపీ అండగా ఉంటుందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఫార్మా కంపెనీల ఏర్పాటును నిరసిస్తూ కొన్ని రోజులుగా దుద్యాల మండలంలోని హకీంపేట గ్రామంలో రైతులు చేస్తున్న రిలే దీక్షలకు శనివారం ఆమె మద్దతు తెలిపి మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న భూముల్లో కాలుష్యాన్ని వెదజలే ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయడం సమంజసం కాదని.. వాటిని బీడు భూములు, అసైన్డ్ భూముల్లో ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు.

ఫార్మా కంపెనీల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకోకపోతే రైతులు తిరుగబడతారని ఆమె హెచ్చరించారు. ప్రధాని మోదీ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తున్నదని గుర్తు చేశారు. అంతకుముందు ఆమె పోలేపల్లిలోని ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పున్నచంద్ లాహోటీ, ప్రతాప్‌రెడ్డి, బాబయ్య నాయుడు, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి

కర్కల్‌పహాడ్‌లో వరి పంటను పరిశీలిస్తున్న రంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహారావు

రంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహారావు

కడ్తాల్, అక్టోబర్ 5 : రైతులు పంటల సాగులో అధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరిగ్గా పాటించాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహారావు అన్నారు. శనివారం మండలంలోని కర్కల్ పహాడ్ గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. వానకాలం-2024 సీజన్‌కు సంబంధించి వ్యవసాయ విస్తరణాధికారులు ఎంట్రీ చేసిన పంటల వివరాలను ఆయన పరిశీలించి మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో 1,28,870 ఎకరాల్లో వరి పంటను అన్నదాతలు సాగు చేశారని.. 2,96,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నామన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, గ్రేడ్-ఏ ధాన్యానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 ప్రభుత్వం చెల్లించాలని నిర్ణయించిందన్నారు. సర్కారు సన్న రకాలకు అదనంగా రూ.500 బోనస్ ప్రకటించిందన్నారు. పంటల్లో వచ్చే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారిణి శ్రీలత, విస్తరణాధికారులు రమేశ్, అభినవ్, రైతులు ఉన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

నవ సమాజ నిర్మాణంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ఉపాధ్యాయుల పాత్ర గొప్పది

చేవెళ్ల రూరల్, అక్టోబర్ 5: నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని మల్కాపూర్ రెవెన్యూలోని పద్మావతి కన్వెన్షన్‌లో ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని టీచర్లకు నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 317 జీవో సమస్యలపై దసరా పండుగలోపే ఓ నిర్ణయం తీసుకుంటామని, టీచర్లు నిర్భయంగా ఉండాలన్నారు. 317 జీవోతోపాటు పీఆర్సీ, డీఏలు తదితర సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదన్నారు. దేశంలో న్యూ ఎడ్యుకేషన్ పాలసీ వచ్చిందని, ఈ విధానం మన పిల్లలకు ఎంతవరకు లాభం చేస్తుందో అనే విషయంపై ఆలోచన చేస్తున్నామన్నారు. ఫిజికల్ స్కూళ్లను ఏ విధంగా డెవలప్ చేయాలనే విషయంలో సబ్ కమిటీ నేతృత్వంలో సమీక్షలు..సంప్రదింపులు చేస్తున్నామన్నారు. పరిగి ఎమ్మెల్యే టీచర్లకు ప్లాట్లు అందించాలని మంత్రిని కోరగా..ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ..టీచర్లు 317 జీవోతో ఇబ్బంది పడుతున్నారని.. ఆ సమస్యను పరిష్కరించాలని, అదేవిధంగా రంగారెడ్డి జిల్లాలోని రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయని వాటి మరమ్మతులకు నిధులు కేటాయించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, తాండూరు, పరిగి ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ వసంతం, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్, పీఏసీఎస్ చైర్మన్లు ప్రతాప్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య, మాజీ జడ్పీటీసీ మాలతి, మాజీ సర్పంచ్ శైలజ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాములు, ఆర్డీవో సాయిరాం, ఐదు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కెట్ ఔన్నత్యాన్ని కాపాడాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్, నీటిసరఫరా, మహిళా, శిశు, సంక్షేమ శాఖల మంత్రి సీతక్క
- ఘనంగా గడ్డిఅన్నారం వ్యవసాయ (పండ్ల) మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం..
- పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ తదితరులు

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 5 : రాష్ట్రంలో పేరున్న గడ్డిఅన్నారం వ్యవసాయ(పండ్ల) మార్కెట్ ఔన్నత్యాన్ని, గౌరవాన్ని కాపాడాలని రాష్ట్ర పంచాయతీరాజ్, నీటిసరఫరా, మహిళా, శిశు, సంక్షేమ శాఖల మంత్రి అనసూయ(సీతక్క) అన్నారు. బాటసింగారంలోని గడ్డిఅన్నారం వ్యవసాయ(పండ్ల) మార్కెట్‌లో శనివారం నిర్వహించిన నూతన కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ చౌదరిమెట్టు భాస్కరాచారి, సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. అందరి దీవెనలు, సమ్మక్క సారక్కల ఆశీస్సులు గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీపై ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గుర్తించి నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కల్తీ పండ్లను మార్కెట్‌లోకి రాకుండా చూడాలని కమిటీ సభ్యులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నదన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతన్నల పార్టీ అని ఆమె పేర్కొన్నారు. మార్కెట్ అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కవ్వం సత్యనారాయణ, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, భువనగిరి పార్లమెంట్ సభ్యుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మల్లేశం, దయానంద్‌గుప్తా, మల్‌రెడ్డి రాంరెడ్డి, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్మన్ జయశ్రీరాజు, ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, నూతన కమిటీ డైరెక్టర్లు అంజయ్య, లక్ష్మి, రఘుపతిరెడ్డి, నర్సింహ, మశ్చేందర్‌రెడ్డి, గణేశ్‌నాయక్, జైపాల్‌రెడ్డి, నవరాజ్, మధుసూదన్‌రావు, గోవర్ధన్‌రెడ్డి, ఇబ్రహీం, వెంకటేశ్వర్లుగుప్తా, మాజీ ఎంపీపీ రేఖామహేందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ దాస్‌గౌడ్, మాజీ వైస్ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, గౌస్ పాషా, వెంకటేశ్, పరిసర గ్రామాల మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.